## అమెరికా సామ్రాజ్యవాదం

# ఆఫ్ఘనిస్తాన్‌పై 15 ఏళ్ల దురాక్రమణ యుద్ధం

**2001** అక్టోబరు 7న ఆఫ్ఘనిస్తాన్‌పై పూర్తిస్థాయి సైనిక దురాక్రమణను అమెరికా సామ్రాజ్య వాదం సాగించింది. వరల్డ్ ట్రేడ్ సెంటరుపై 2001 సెప్టెంబరు 11న జరిగిన టెర్రరిస్టు దాడులను సాకుగా చూపి అధ్యక్షుడు బుష్ "టెర్రరిజంపై పోరు"ను ప్రకటించాడు. ఈ దాడులను సాగించిన అల్‌ఖైదాకు తాలిబన్ ప్రభుత్వం ఆశ్రయమిచ్చిందనీ, దాని నాయకుడు ఒసామా బిన్ లాడెన్‌ను అప్పగించేందుకు నిరాకరించిందని బుష్ చెప్పుకున్నాడు.

తర్వాతి రోజులలో వాస్తవాలు బయటికొచ్చాయి. దురాక్రమణకు పథకాలు సిద్ధంచేసి పెట్టుకుని, వాటి కనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు ఈ అబద్ధాలను ప్రచారంలో పెట్టారు. ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్‌కుగానీ, అల్‌ఖైదాకుగానీ ఈ దాడులతో సంబంధంలేదని బయటపడింది. సౌదీఅరేబియా సహకారం పొందుతున్న అమెరికాలోని ఒక టెర్రరిస్టు సెల్ ఈ దాడులకు పాల్పడింది. దాడి జరగబోతున్నదన్న సూచనలున్నప్పటికీ, అమెరికా గూఢచారి సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఊరకుండిపోయాయన్న సందేహాలు కూడా వున్నాయి.

పశ్చిమాసియాలో రష్యా సోషల్ సామ్రాజ్య వాదానికున్న ప్రభావాన్ని బలహీనపరిచేందుకు అమెరికా సామ్రాజ్యవాదం సాగించిన కుట్రలో తాలిబన్, అల్‌ఖైదా మూలాలున్నాయి. 1978 నుండీ సౌదీఅరేబియా, పాకిస్తాన్‌లతో కలిసి సిఐఏ, రష్యా మద్దతున్న ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వంపై పోరాడేందుకు ముస్లిం ఛాందసవాదులకు ఆయుధ, ఆర్థిక సహాయమందజేసింది. అలా శిక్షణ పొందిన వారిలో సౌదీ కోటీశ్వరుడు బిన్‌లాడెన్ ఒకరు. వహాబీ తీవ్రవాదులకు పాకిస్తాన్‌లోని శిబిరాలలో శిక్షణనిచ్చారు.

ఈ మతోన్మాదశక్తులను "స్వాతంత్రయోధులు"గా 1980 దశాబ్దమంతా రీగన్ ప్రభుత్వం కొనియాడింది. ఆఫ్ఘనిస్తాన్‌పై రష్యా దురాక్రమణను ఆఫ్ఘన్ ప్రజలపై సాగించిన నేరంగా ఖండించింది.

ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా సాగించిన యుద్ధానికి ప్రజా ఊచకోతలు పర్యాయపదమయ్యాయి. వియత్నాంలో అది సాగించిన దురాగతాలను మించిపోయిన స్థాయిలో గత 15 ఏళ్లుగా ఆఫ్ఘన్ ప్రజలపై హింసాకాండను సాగించింది. గత మూడు దశాబ్దాలుగా ఆఫ్ఘన్ విషాదానికి సృష్టికర్త అమెరికా సామ్రాజ్యవాదమే. పది లక్షలమంది మృత్యువాతపడటమో లేదా గాయపడటమో జరిగింది. 60 లక్షలమంది దేశం వదలిపోయారు. అతి పెద్ద శరణార్థులను తయారుచేసిన దేశమైంది ఆఫ్ఘనిస్తాన్.

అనేక మారణాయుధాలను పరీక్షించుకునేందుకు అమెరికా సైన్యం ఈ దురాక్రమణను ఉపయోగించు కుంది. బంకర్లను నాశనం చేసేందుకు 6 మీటర్ల వెడల్పు కాంక్రీటు గోడను బ్రద్దలుకొట్టగల బాంబులను ప్రయోగించింది. 1700 మీటర్ల పరిధిలో సర్వస్వాన్ని కాల్చి బూడిద చేయగల 'డైజీ కట్టర్స్' అన్న ఆయుధాలను వాడింది. క్లస్టరు బాంబులతో ఒక ప్రాంతంలో ఖాళీ వదలకుండా బాంబులు వేసింది.

ఆఫ్ఘనిస్తాన్‌తో గల సరిహద్దు సమీపాన వాయువ్య పాకిస్తాన్‌లోని ఆదివాసీ ప్రాంతాలపై సైనిక చర్య తీసుకొమ్మని పాకిస్తాన్‌ను అమెరికా సామ్రాజ్యవాదం ఆదేశించింది. ఫలితంగా వేలాదిమంది ఊచకోతకు గురయ్యారు. లక్షలాదిమంది నిర్వాసితులయ్యారు. తరువాత అమెరికా సైన్యమే పైలెట్‌లేని విమానాలతో క్షిపణి దాడులను ఈ ప్రాంతంపై సాగించి ఊళ్లకు ఊళ్లనే తుడిచిపెట్టింది.

యుద్ధఖైదీలపట్ల జనీవా సదస్సు తీర్మానాన్ని ఉల్లంఘించి, మజర్ ఆల్‌షరీఫ్, కుందుజ్ వంటి పట్టణాలలో బందీలుగా పట్టుకున్న వేలాది మంది తాలిబన్లను అమెరికా సైన్యం చంపించివేసింది. ముస్లిం టెర్రరిస్టు సంస్థలతో ఎలాంటి సంబంధంలేని వందలాది మందిని గ్వాటినామా బే లోకో లేదా సిఐఏ రహస్య శిబిరాలకో పంపించారు. అక్కడ వారిని చిత్రహింసలకు గురిచేశారు.

ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధం మానవాళిపై అమెరికా సామ్రాజ్యవాదం సాగించిన నేరమన్నది స్పష్టమే. అమెరికా సామ్రాజ్యవాదపు పాలకవర్గాలు ఇవే నేరాలను తమ దేశపౌరులపై కూడా సాగించాయి. "టెర్రరిజంపై పోరు" సాకుతో 2001 పేట్రియట్ చట్టాన్ని తెచ్చారు. ఎలాంటి అదుపులేకుండా గూఢచర్యం సాగించే, కాలవ్యవధి లేకుండా జైల్లోపెట్టి, సైనిక కోర్టులను ఏర్పరచే, ముస్లిం నేపథ్యమున్న అమెరికన్ పౌరులను వేధించే అధికారాలను దఖలు పరుచుకున్నాయి. టెర్రరిస్టులను నియంత్రించటం ఈ చట్టం లక్ష్యం కాదు. ఆ పేరుతో ప్రజలను అణచివేయటమే దాని లక్ష్యం.

ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణను అనుసరించి ఇరాక్‌పై దురాక్రమణ సాగించింది; పశ్చిమాసియాలో తన సైనిక స్థావరాలను నెలకొల్పింది. లిబియాపై దాడులు సాగించింది. ఆఫ్రికా కొమ్ము ప్రాంతం (ఇథియోపియా, సోమాలియా)లో సైనిక జోక్యాన్ని సాగించింది. అయినా ఇన్నాళ్లుగా ఆఫ్ఘనిస్తాన్‌నుండి సైన్యాలను ఉపసంహరించుకుంటున్నానని పలుమార్లు అమెరికా ప్రకటిస్తూ వచ్చింది. ప్రపంచ ప్రజలను మోసగించటానికే ఈ ప్రకటనలు చేసింది. ఆఫ్ఘనిస్తాన్‌లో నుండి అమెరికా సైన్యాలు వైదొలగితే తన తొత్తు ప్రభుత్వం కుప్పకూలిపోతుంది.

ఈ పదిహేనేళ్ల దురాక్రమణ యుద్ధానికి ప్రజల నుండి ప్రతిఘటన ఎదురైంది. వేలాదిమంది అమెరికా సైనికులు మృతిచెందారు. ఓటమికి గురికాకుండా, తాలిబన్లు, ఇతర దురాక్రమణ వ్యతిరేకశక్తులూ దురాక్రమణకూ, తొత్తు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూనే వున్నారు. దక్షిణ ఆఫ్ఘనిస్తాన్ వీరి ఆధీనంలోనే వుంది. అమెరికా సామ్రాజ్యవాదం సాగించిన దీర్ఘయుద్ధమిది. దీనికి 80వేల కోట్ల డాలర్లు ఖర్చు అయింది. ఇప్పటికీ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నిలబెట్టే పని అమెరికాదే. ఈ తొత్తు ప్రభుత్వం అవినీతిమయం. గంజాయి వ్యాపారంతో జేబులు నింపుకుంటుంది.

15 ఏళ్ల యుద్ధం తర్వాత కూడా అమెరికా తన లక్ష్యాన్ని పూర్తిగా సాధించలేకపోయింది. మధ్యప్రాచ్యంపై సంపూర్ణ ఆధిపత్యాన్ని పొందలేకపోయింది (అక్కడి చమురుపై కూడా). ఈ లక్ష్యం కోసం అది మరిన్ని దేశాలపై (ఇరాక్, లిబియా) దురాక్రమణను సాగించాల్సి వచ్చింది; సిరియాపై దురాక్రమణకు పూనుకోవాల్సి వచ్చింది. ఇవికాక, అనేక సైనిక జోక్యాలనూ సాగించాల్సి వచ్చింది.

మారణాయుధాలను చేపట్టి అమెరికా సామ్రాజ్యవాదం వెళ్లిన చోటల్లా అది ప్రజల ఆగ్రహానికి గురయింది. ప్రజా ప్రతిఘటన అన్న ఊబిలో కూరుకుపోయింది.

ooooo